సాక్షి నిర్మల్
శనివారం । 8 । మార్చి । 2025




మహిళా దినోత్సవం



- ఇళ్లలో స్వేచ్ఛ లభిస్తోంది..
- బయట అనుమానపు చూపులే
- తెలియని వారితోనే సమస్యలు
- మహిళా దినోత్సవం సందర్భంగా 'సాక్షి' సర్వే

బస్టాప్‌ల్లో ఇబ్బందే..!



మంచిర్యాలఅర్బన్/మంచిర్యాలటౌన్/చెన్నూర్/నిర్మల్/వాంకిడి/బోథ్/ఆసిఫాబాద్‌రూరల్: మహిళలు, యువతులు, విద్యార్థినులు అవకాశాలను అందిపుచ్చుకుంటూ అన్నిరంగాల్లో రాణిస్తున్నారు. పురుషులకు దీటుగా పనులు చేస్తూ తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు. కానీ సమాజంలో అక్కడక్కడ మహిళలపై చిన్నచూపు ఉండడంతో అనేక అవకాశాలకు దూరమవుతున్నారు. పని ప్రదేశాల్లో వేధింపులు, ఆధిపత్య ధోరణులు మహిళలకు ప్రతిబంధకంగా మారుతున్నాయి. ఎక్కడ.. ఎవరితో వివక్షకు గురవుతున్నారనే అంశాలపై 'సాక్షి' మంచిర్యాలలోని శ్రీహర్ష డిగ్రీ కళాశాలతోపాటు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో విద్యార్థినులు, యువతులు, మహిళలు 350మంది నుంచి సర్వే ద్వారా వివరాలు సేకరించింది. తెలియని వారు, ఆకతాయిలతో ఇక్కట్లు పడుతున్నట్లు తేల్చిచెప్పారు. బస్టాప్‌ల్లో అత్యధికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వెల్లడైంది. ఇళ్లలో ఆడ, మగ అనే వివక్ష లేదని, అభిప్రాయాలకు గౌరవం లభిస్తోందని స్పష్టమైంది.

ప్రోత్సహిస్తే రాణిస్తారు



ప్రస్తుత సమాజంలో కాస్త ప్రోత్సహిస్తే మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. ఇప్పటికీ చాలా ఇళ్లల్లో మహిళలకు పూర్తిస్థాయి స్వేచ్ఛ లేదు. కనీసం తమ ఆశలు, ఆశయాలను సాధించుకునే స్వేచ్ఛ మహిళలకు ఉండాలి. – సుమలత, ఎస్సై, లక్ష్మణచాంద

ఇంకా పరిమితుల మధ్యనే..



స్త్రీలకు ఇప్పటికీ సమాజంలో పరిమితులున్నాయి. చాలామంది మహిళలు ఇలాంటి అడ్డుగోడల మధ్యనే ఎన్నో విజయాలు సాధించగలుగుతున్నారు. స్వేచ్ఛ, సమానత్వాన్ని ఇస్తే మహిళ సాధించలేనిదంటూ లేదు.

– అర్చన, అసిస్టెంట్ ప్రొఫెసర్, నిర్మల్

సమాన హక్కులుండాలి



ఆడ, మగ అనే తేడా లేకుండా సమాజంలో అందరికీ సమాన హక్కులు ఉండాలి. అప్పుడే ఆడవాళ్లకు సరైన గౌరవ మర్యాదలు దక్కుతాయి. మహిళలను వేధించేది కాకుండా, గౌరవించే సమాజం కావాలి.

– అపర్ణ, హెడ్‌నర్స్, జిల్లా జనరల్ హాస్పిటల్

మరింత రక్షణ ఉండాలి



కొన్ని ఘటనలు చూస్తుంటే బయటకు వెళ్లాలంటే ఒక్కోసారి భయపడాల్సి వస్తోంది. చాలాచోట్ల ఇప్పటికీ మహిళలకు సరైన రక్షణ లేదనిపిస్తోంది. ఆడవాళ్లకు మరింత రక్షణ కల్పించాల్సిన బాధ్యత అందరిది.

– కవిత, గృహిణి, ఖానాపూర్

అవకాశాలు పెరిగాయి



నేడు మహిళలకు అవకాశాలు పెరిగాయి. ఏ రంగంలోనైనా కొద్దిపాటి వివక్ష ఉంటుంది. పట్టించుకోకుండా నిబద్ధతతో పనిచేస్తే గుర్తింపు వస్తుంది. రాజకీయాల్లోనూ మహిళలు ధైర్యంగా ముందుకు రావాల్సిన అవసరముంది.

– సిరం సుష్మారెడ్డి, బీజేపీ మండలాధ్యక్షురాలు, భైంసా

స్వయంశక్తి

- తమ కాళ్లపై తాము నిలుస్తూ.. • మరికొందరికి ఉపాధినిస్తూ.. • కుటుంబానికి తోడ్పాటునిస్తూ..
- సమాజంలో ఆదర్శంగా నిలుస్తున్న పలు మహిళా సంఘాల సభ్యులు
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం



అన్నింటికీ ఆమే ఆధారం. అమ్మగా, ఆలిగా, అక్కగా, చెల్లిగా, బిడ్డగా అన్ని బాధ్యతల్లోనూ మెప్పిస్తోంది. ఇంటిల్లిపాదిని చూసుకుంటూనే ఇంటి బాధ్యతల్లోనూ భర్తకు బాసటగా నిలుస్తోంది. తన కాళ్లపై తాను నిలవడమే కాకుండా తనతోపాటు పదిమందికి ఆసరా అవుతోంది. నారీశక్తి తలుచుకుంటే కానిదంటూ ఏదీ లేదని చాటుతోంది. తన పరిధిలోనే స్వయంశక్తితో, సమష్టితత్వంతో, సంఘటితంగా ఆర్థిక స్వావలంబనను సాధిస్తోంది. అన్నీ ఉండి సోమరితనంతో నిద్రపోతున్న ఎంతోమందికి ఆదర్శమూర్తిగా నిలుస్తోంది. జిల్లాలో ఒక్కో మండలంలో ఒక్కో వినూత్న ఉపాధితో సత్తా చాటుతున్నారు స్వయంసహాయక సంఘాల మహిళలు. తాము ఉపాధిని పొందడంతో పాటు పదిమందికి ఆదర్శంగానూ నిలుస్తున్నారు. కలెక్టర్ అభిలాషఅభినవ్, డీఆర్డీవో విజయలక్ష్మి, సంబంధిత అధికారుల ప్రోత్సాహంతో ముందడుగేస్తున్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వీరిపై ప్రత్యేక కథనం.

– నిర్మల్

అమెరికాకు పిండివంటలు..



కిష్టాపూర్‌లో పిండివంటలు తయారు చేస్తున్న మహిళా సంఘ సభ్యులు

ఎక్కడో ఉన్న అమెరికాకు ఇక్కడి ఓ పల్లెటూరి మహిళలు పిండివంటలు చేసి పంపిస్తున్నారు. ఆస్ట్రేలియా, దుబాయి వాసులకూ తమ చేతివంటల రుచి చూపిస్తున్నారు. లోకేశ్వరం మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన సరస్వతీ గ్రామైక్య సంఘం సభ్యులైన గొల్లమాడ ప్రణీత, శైలజ, వనజ, మాధురి, లక్ష్మి తమకు వచ్చిన వంటనే తమకు ఆసరాగా మార్చుకున్నారు. వారంతా కలిసి అన్నపూర్ణ క్యాటరింగ్ పెట్టుకున్నారు. చకినాలు, గారెలు, మురుకులు, అరిసెలు, లడ్డూలు తదితర పిండివంటలు చేస్తున్నారు. శుభకార్యాల కోసం కూడా వంటలు చేసిస్తున్నారు. వీరు చేస్తున్న పిండి వంటలు రుచిగా ఉండటంతో అమెరికా, ఆస్ట్రేలియా, దుబాయి తదితర దేశాలకూ తీసుకెళ్తున్నారు. ఒక్కసారి తిన్నవారు మళ్లీమళ్లీ పంపించాలని కోరుతుండటం గమనార్హం.

వచ్చిన పనితోనే ఉపాధి



మేము ఏదైనా ఉపాధి పొందాలనుకున్నాం. మాకు వచ్చిన వంటలనే ఉపాధిగా మలుచుకున్నాం. ఇందుకు రూ.2లక్షల రుణం తీసుకుని నెలకు రూ.8వేల చొప్పున చెల్లిస్తున్నాం. మిగిలిన లాభాన్ని అందరం పంచుకుంటున్నాం.

– గొల్లమాడ ప్రణీత, కిష్టాపూర్

గాజుల తయారీతో..



నిర్మల్ ఉత్సవాల్లో గాజులు విక్రయిస్తున్న మహిళలు

గాజులంటే మహిళలకు చాలా ఇష్టం. వాటి తయారీ అంటే అందరికీ హైదరాబాద్‌లోని చార్మినారే తెలుసు. కానీ.. జిల్లాలోనూ డిజైన్ గాజులను తయారు చేస్తున్నారు. వాటితో ఉపాధి పొందుతున్నారు. సోన్, లక్ష్మణచాంద మండల కేంద్రాల్లో కలిపి దాదాపు 50–60మంది మహిళా సంఘాల సభ్యులు గాజులు తయారు చేస్తున్నారు. ఈడీఐఐ సంస్థ సహకారంతో ఇంటివద్ద ఉంటూనే డిజైన్ బ్యాంగిల్స్ తయారు చేస్తూ ఉపాధి పొందుతున్నారు.

శానిటరీ ప్యాడ్స్ తయారీ



శానిటరీ ప్యాడ్స్ తయారు చేస్తున్న మహిళలు

రేలా.. పేరిట శానిటరీ ప్యాడ్స్ తయారు చేస్తూ జిల్లాకు పేరు తీసుకురావడమే కాదు.. వారూ ఉపాధి పొందుతున్నారు. కుంటాల మండలకేంద్రంలో డీఆర్డీవో విజయలక్ష్మి సూచనలు, రూర్బన్ కింద వచ్చిన రూ.20లక్షల నిధులను అక్కడి మహిళలు ఇలా సద్వినియోగం చేసుకుంటున్నారు. నిధులతో యంత్రాలు, సామగ్రి కొనుగోలు చేసి నాణ్యతతో శానిటరీ న్యాప్‌కిన్స్ తయారు చేస్తున్నారు. ఇతర జిల్లాలకూ పంపిస్తున్నారు. ఇటీవల హైదరాబాద్ నుంచి ఓ కంపెనీవాళ్లు వచ్చి చూసివెళ్లారు. మండలం, జిల్లా స్వయంసహాయక సంఘాల సభ్యులు ఇక్కడ ఉపాధితో పాటు తయారీలో శిక్షణ పొందుతున్నారు.

ఉపాధి లభిస్తోంది



స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆర్థికంగా ఆసరా అందించేందుకు రేలా పేరిట బయోడిగ్రేడెబుల్ న్యాప్‌కీన్స్ తయారు చేస్తున్నాం. దీంతో మాకు పనితో పాటు ఉపాధి లభిస్తోంది. ఎస్‌హెచ్‌జీ సభ్యులకు శిక్షణ కూడా ఇస్తున్నాం.

– శారద, కుంటాల

బోట్లతో ఉపాధి ..



మహిళల బోట్లలో జిల్లా అధికారులు

తమకు అందుబాటులో ఉన్నవాటితో ఉపాధి పొందుతున్నారు బాసరకు చెందిన మహిళలు. వాళ్లకు గోదారమ్మే అన్నీ. ఆ అమ్మను నమ్ముకుని మహిళా సంఘాల ఆధ్వర్యంలో బోట్ల కోసం రుణాలు తీసుకున్నారు. తమ కుటుంబసభ్యుల ద్వారా పడవలను నడిపిస్తూ.. వాటి ద్వారా ఆదాయాన్ని పొందుతున్నారు.

వావ్.. అనిపించే ఫిష్‌పికిల్



చేప పచ్చళ్లను తయారు చేస్తున్న మహిళలు

చేపలంటే నాన్‌వెజ్ ప్రియులకు చాలా ఇష్టం. కానీ.. ఎప్పుడు పడితే అప్పుడు తినలేం. అలాంటివాళ్లకు ఇంట్లోనే పికిల్ (పచ్చడి) రూపంలో చేపలను అందించే ఆలోచనతో వాళ్లు ముందుకు వచ్చారు. కడెం మండల కేంద్రానికి చెందిన 50 మంది మహిళలు ఇందిరా మహిళాశక్తి పథకం, ఈడీఐఐ యాక్సెంచర్ ఎన్‌జీవో సహకారంతో చేపలు, రొయ్యలతో పాటు చికెన్ పచ్చళ్లు తయారు చేస్తున్నారు. స్థానికంగా లభించే రొయ్యలను ఎండబెట్టి విక్రయిస్తున్నారు. వీరు చేసే పచ్చళ్లు నాణ్యతతో ఉండటంతో స్థానికంగానే కాకుండా మలేషియా, దుబాయి నుంచీ డిమాండ్ పెరుగుతోంది. వారికి ఆదాయమూ కలిసి వస్తోంది.

నాణ్యత పాటిస్తున్నాం



స్థానికంగా చేపలు ఎక్కువగా లభిస్తాయి. మాకు అవగాహన ఉన్న పచ్చళ్ల తయారీనే ఉపాధిగా మార్చుకుని నాణ్యతతో అందిస్తున్నాం. పచ్చళ్లకు డిమాండ్ పెరుగుతున్న కొద్దీ మాకు ఆదాయం లభిస్తోంది.

– రేణుక, కడెం

పిచ్చుకల కోసం వరికుచ్చులు



వరికుచ్చులు తయారు చేస్తున్న మండల సమాఖ్య సభ్యులు

కనుమరుగైపోతున్న పిచ్చుకలను మళ్లీ మన ఇంటికి రప్పించే ఓ మంచి ప్రయత్నాన్ని నిర్మల్ మండల మహిళా సమాఖ్య చేపట్టింది. వాటి పొట్ట నింపేలా, ఇంటికి లక్ష్మీకళ తెచ్చేలా వరికుచ్చుల తయారీని చేపట్టింది. నిర్మల్‌రూరల్ మండలం కొండాపూర్‌లో గణపతి స్వయంసహాయక సంఘం మహిళలు చేస్తున్న సమీకృతసాగులో భాగంగా పండిస్తున్న వరితోనే ఈ కుచ్చులను చేస్తుండటం విశేషం. డీఆర్డీవో విజయలక్ష్మి ఆలోచనతో ప్రారంభమైన ఈ వరికుచ్చులకు డిమాండ్ పెరుగుతోంది. నిర్మల్‌నుంచి హైదరాబాద్, విజయవాడ, వరంగల్, సంగారెడ్డి, సిద్దిపేట, నిజామాబాద్ తదితర జిల్లాలకూ తీసుకెళ్తున్నారు.

సేవ్‌బర్డ్స్ నినాదంతోనే..



పిచ్చుకలను రక్షించాలన్న నేపథ్యంలో వరికుచ్చుల తయారీ ఆలోచన వచ్చింది. రెగ్యులర్‌గా కావాలంటూ హైదరాబాద్ నుంచి ఇటీవల చాలామంది ఫోన్లు చేస్తున్నారు. ఒక్కో వరికుచ్చును రూ.300కు విక్రయిస్తున్నాం. సభ్యులకు పనితోపాటు లాభం, పిచ్చుకలకూ ఆహారం అందుతోంది.

– విజయలక్ష్మి, డీఆర్డీవో

నాట్యగురువు సౌమ్య

- చిన్నారులకు కూచిపూడిలో శిక్షణ
- రికార్డ్ ప్రదర్శనల్లో భాగస్వామ్యం



ముచ్చింతల్ సమతాకుంభ్-2025 ప్రదర్శనలో పాల్గొన్న భైంసా చిన్నారులు (ఫైల్)



రంగు సౌమ్య

భైంసాటౌన్: చిన్ననాటి నుంచే నృత్యంపై ఉన్న మక్కువతో తాను నేర్చుకుని ఎంతోమంది చిన్నారులకు నేర్పుతూ దానినే ఉపాధిగా మలుచుకున్నారు భైంసాకు చెందిన రంగు సౌమ్య. జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి వేదికల్లోనూ తన శిష్యబృందంతో ప్రదర్శనలు ఇప్పిస్తున్నారు. ఫలితంగా నృత్యరంగంలో భైంసాకు ప్రత్యేక గుర్తింపు తెస్తూ అందరి అభినందనలు అందుకుంటున్నారు. సౌమ్యకు చిన్నప్పటి నుంచే నృత్యంపై మక్కువ ఉన్నా పెళ్లయిన తరువాత భర్త ప్రోత్సాహంతో నిజామాబాద్‌లో నృత్య గురువులు భీమన్, దేవులపల్లి ప్రశాంత్ వద్ద నాలుగేళ్లపాటు కూచిపూడి నృత్యంలో శిక్షణ తీసుకున్నారు. అనంతరం భైంసాలో తానే సొంతంగా శ్రీనయనం నృత్యా కళానిలయం పేరిట చిన్నారులకు ప్రధానంగా కూచిపూడి నృత్యంలో శిక్షణ ఇస్తున్నారు. మొదట ఐదుగురు చిన్నారులతో మొదలై, నేడు వందమందికి పైగా శిక్షణ తీసుకుంటున్నారు. తన వద్ద శిక్షణ పొందిన చిన్నారులతో పలు పుణ్యక్షేత్రాల్లో ప్రదర్శనలు ఇప్పిస్తూ ఎన్నో ప్రశంసాపత్రాలు, అవార్డులు అందుకున్నారు. తన భర్త, కుటుంబీకుల ప్రోత్సాహంతోనే తాను నృత్యరంగంలో రాణిస్తున్నట్లు ఈ సందర్భంగా రంగు సౌమ్య తెలిపారు.

శిష్యబృందంతో ఇచ్చిన ప్రదర్శనలు

- అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని పురస్కరించుకుని తన శిష్య బృందంతో నృత్య ప్రదర్శన ఇచ్చి ప్రశంసా పత్రాలు అందుకున్నారు.
- ఇటీవల అరుణాచలంలో ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు 15 మంది చిన్నారులతో కలిసి నృత్య ప్రదర్శన ఇచ్చారు.
- హైదరాబాద్‌లో నిర్వహించిన గిన్నిస్‌బుక్ రికార్డ్ నృత్య ప్రదర్శనలోనూ పాల్గొని పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందుకున్నారు.
- గతనెలలో రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం ముచ్చింతల్ శివారులోని సమతా స్ఫూర్తి కేంద్రంలో సమతాకుంభ్-2025 పేరిట తృతీయ బ్రహ్మోత్సవాలు నిర్వహించగా 3వేల మంది చిన్నారులతో నృత్య రూపకాలు ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలు ఇండియన్ వరల్డ్ రికార్డ్స్, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌కు నమోదయ్యాయి. ఇందులో భైంసా నుంచి శ్రీనయనం నృత్య కళానిలయానికి చెందిన 21 మంది చిన్నారులు పాల్గొని ప్రశంసాపత్రాలు అందుకున్నారు.

ఓ మహిళా.. చట్టం తెలుసుకో..

- స్త్రీల కోసం ఎన్నో చట్టాలు
- అవగాహన లేక ఇబ్బందులు



అర్చన, అడ్వకేట్

నిర్మల్: పరస్త్రీని కూడా తల్లితో సమానంగా చూడాలని మన ధర్మం చెబుతోంది. కానీ.. చాలామంది భార్యాపిల్లలపై దారుణాలకు పాల్పడుతున్నారు. ఇలాంటి సందర్భాల్లో చాలామంది ఏం చేయాలో పాలుపోక ఆత్మహత్యనే శరణ్యమనుకుంటున్నారు. కానీ.. మన దేశంలో మహిళలకు రక్షణ కల్పించేందుకు అనేక చట్టాలున్నాయి. మహిళా దినోత్సవం నేపథ్యంలో నిర్మల్‌కు చెందిన న్యాయవాది సీహెచ్ అర్చన మహిళలకు సంబంధించిన చట్టాలు, హక్కుల గురించి వివరించారు.

నిర్భయ చట్టం 2013: ఈ చట్టాన్ని 2013లో కేంద్ర ప్రభుత్వం కొత్త ఢిల్లీలో జరిగిన ఘటన నేపథ్యంలో తీసుకువచ్చింది. జస్టిస్ వర్మ కమిటీ సూచనల మేరకు మహిళలపై లైంగికదాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని నిర్ణయించింది. అత్యాచారం, మహిళలకు సంబంధించిన ఇతర నేరాల్లో నిందితులకు మరణ శిక్ష కూడా పడేలా కఠినతరం చేసింది.

సమాన వేతన హక్కు చట్టం: ఏ యజమాని కూడా వేతనాలు లేదా నియామకాల్లో లింగ వివక్ష చూపరాదు. వేతన వివక్ష ఎదుర్కొంటే మహిళలు లేబర్ కోర్టును సంప్రదించవచ్చు.

ఆస్తి హక్కు: హిందూ వారసత్వ చట్టం–1956 ద్వారా ఈ హక్కు కల్పించారు. 2005లో సవరించారు. కుమార్తెలకు వారి పూర్వీకుల ఆస్తిలో కొడుకులతో సమాన హక్కులున్నాయి. తండ్రి వీలునామా లేకుండా మరణించినప్పటికీ కుమార్తెకు ఆమె సోదరులతో సమాన వాటా ఉంటుంది. ఇది వివాహిత కుమార్తెలకూ వర్తిస్తుంది.

గృహ హింస నిరోధక చట్టం 2005: జీవిత భాగస్వామి, అత్తమామలు లేదా కుటుంబ సభ్యుల నుంచి శారీరక, మానసిక, లైంగిక లేదా ఆర్థిక వేధింపులను ఎదుర్కొంటున్న మహిళలు ఈ చట్టం కింద రక్షణ పొందవచ్చు. ఇది భర్త లేదా అత్తమామల యాజమాన్యంలో ఉన్నప్పటికీ ఉమ్మడి ఇంట్లో నివసించే హక్కును మంజూరు చేస్తుంది. జీవన భృతి, కస్టడీ ఉత్తర్వులు, రక్షణ అందిస్తుంది.

లింగ ఎంపిక నిషేధ చట్టం 1994: భారతదేశంలో స్త్రీ భ్రూణ హత్యలను ఆపడానికి, క్షీణిస్తున్న లింగ నిష్పత్తిని అరికట్టడానికి భారత పార్లమెంట్ రూపొందించిన చట్టమిది. ఈ చట్టం ప్రకారం స్త్రీల పట్ల వివక్షత నివారించడం, లింగ ఎంపిక, గర్భస్రావం ద్వారా స్త్రీభ్రూణ హత్యలను నిషేధించారు. తల్లి/బిడ్డ ఆరోగ్యానికి ఏదైనా హాని కలిగే పరిస్థితుల్లో, జన్యుసంబంధిత వ్యాధులకు మాత్రమే తల్లి అంగీకారంతోనే గర్భస్రావం చేయించుకునే అవకాశముంది. అక్రమంగా స్కానింగ్ చేసి లింగనిర్ధారణ పరీక్ష ఫలితాలు వెల్లడి చేస్తే చట్టరీత్యా నేరంగా పరిగణించి కఠినశిక్షలు విధిస్తారు.

పని ప్రదేశంలో వేధింపులు: పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పించడానికి, లైంగిక వేధింపుల ఫిర్యాదులు, పరిష్కారం కోసం పని ప్రదేశాల్లో వేధింపులు, నివారణ, నిషేధం, పరిహారం చట్టం–2013 రూపొందించారు. ఒక కీలకమైన కేసుపై తీర్పునిస్తూ సుప్రీంకోర్టు 1997లో 'విశాఖ' మార్గదర్శకాలను వెలువరించింది. దీంతో కేంద్ర ప్రభుత్వం 2013లో పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులకు సంబంధించి ఈ చట్టాన్ని అమలులోకి తెచ్చింది.

వరకట్న నిషేధ చట్టం–1961: ఈ చట్టం వరకట్నం ఇవ్వడం, తీసుకోవడాన్ని నిషేధించింది. ఈ చట్టాన్ని అతిక్రమిస్తే ఐదేళ్లకు తగ్గకుండా జైలు శిక్ష, రూ.15వేలదాకా జరిమానా విధించడానికి ఆస్కారం ఉంది. ప్రత్యక్షంగా గాని పరోక్షంగా గాని కట్నం అడిగితే ఆరునెలల నుంచి రెండేళ్ల వరకు జైలుశిక్ష, రూ.10వేలవరకు జరిమానా విధించవచ్చు.

ఈవీఎం గోదాం తనిఖీ

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ రూరల్ మండలం ఎల్లాపల్లి వద్ద ఉన్న ఈవీఎం, వీవీ ప్యాట్ గోదాంను కలెక్టర్ అభిలాష అభినవ్, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, వివిధ రాజకీయ పార్టీల సమక్షంలో శుక్రవారం తనిఖీ చేశారు. తాళానికి వేసిన సీల్, సీసీ కెమెరాలో రికార్డవుతున్న విధానాన్ని పరిశీలించారు. తనిఖీ రిజిస్టర్‌లో సంతకం చేశారు. గోదాం తనిఖీ నివేదికను ఎన్నికల సంఘం కార్యాలయానికి పంపించాలని పర్యవేక్షకులకు సూచించారు. ఆర్డీవో రత్నకళ్యాణి, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు శ్రీనివాస్, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్, వైఎస్సార్‌సీపీ ప్రతినిధులు గాజుల రవికుమార్, కొరిపెల్లి శ్రావణ్‌రెడ్డి, మహ్మద్ నయీ మ్, నరేశ్, భద్రత సిబ్బంది, అధికారులున్నారు.

క్లుప్తంగా

290 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



బియ్యాన్ని పట్టుకున్న పోలీసులు

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని జైనథ్ పోలీసులు శుక్రవారం ఉదయం పట్టుకున్నారు. పీడీఎస్ బియ్యాన్ని లారీలో తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో వాహనాల తనిఖీ చేపట్టారు. బోరజ్ మండల కేంద్రం జాతీయ రహదారి–44పై బస్టాండ్ వద్ద ఓ లారీని తనిఖీ చేయగా అందులో 290 క్వింటాళ్ల బియ్యాన్ని గుర్తించారు. హైదరాబాద్ నుంచి మధ్యప్రదేశ్‌లోని బాలగట్‌కు తరలిస్తున్నట్లు జైనథ్ సీఐ డి.సాయినాథ్ తెలిపారు. పట్టుకున్న బియ్యం విలువ సుమారు రూ.16 లక్షల వరకు ఉంటుందని పేర్కొన్నారు. సంఘటన స్థలానికి ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి చేరుకుని వివరాలను అడిగి తెలుసుకున్నారు. అక్రమంగా బియ్యం, ఇసుక రవాణా చేసేవారిపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. లారీడ్రైవర్ తాహిర్‌ను అదుపులో తీసుకుని, ఆయనతోపాటు లారీ యజమాని ఎండీ.నజీమ్, బియ్యం సరఫరా చేస్తున్న నిందితులు నాగనాథ్, షఫీలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పట్టుకున్న బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులకు అప్పగించారు. జైనథ్ ఎస్సై పురుషోత్తం, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

మహిళా దినోత్సవ శుభాకాంక్షలు



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని కేబీ కాంప్లెక్స్‌లోని డిగ్రీ కళాశాలలో శుక్రవారం మహిళా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా హాజరై విద్యార్థినులకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శతాబ్దాలుగా సంస్కృతి, సంప్రదాయాలు మహిళలను ఆరాధిస్తూ గౌరవిస్తున్నాయని పేర్కొన్నారు. పురుషులకు సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని కొనియాడారు. చదువును డిగ్రీతో ఆపేయకుండా కొనసాగించాలన్నారు. భవిష్యత్తులో వారియర్లుగా ధైర్య సాహసాలు ప్రదర్శించాలన్నారు. గతంలో త్యాగాలు చేసిన మహిళలకు శిరస్సు వంచి సమస్కరిస్తున్నానని పీవో పేర్కొన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ అభినవ్, కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పశువులను తరలిస్తున్న వాహనం పట్టివేత



పోలీసులు పట్టుకున్న వాహనం

కుభీర్: అక్రమంగా పశువులను బొలెరో వాహనంలో తరలిస్తుండగా కుభీర్ సమీపంలో శుక్రవారం పట్టుకున్నట్లు ఎస్సై పి.రవీందర్ తెలిపారు. మహారాష్ట్రలోని హిమాహిత్‌నగర్ నుంచి బొలెరో వాహనంలో 12 పశువులను నిజామాబాద్ జిల్లా షాటాపూర్‌కు తరలిస్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. షేక్ ఫయాజ్, షేక్ అమీన్, షేక్ యూసూఫ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



నారీమణులు

అతివలు అన్నిరంగాల్లో రాణిస్తున్నారు. ఆ దిశగా ముందుకు సాగుతున్నారు. పురుషులకు సమానంగా సత్తా చాటుతున్నారు. క్రీడా, విద్య, స్వయం ఉపాధి, తదితర రంగాల్లో ప్రతిభ కనబర్చి శెభాష్ అనిపించుకుంటున్నారు ఉమ్మడి జిల్లాలోని పలువురు నారీమణులు. కొందరు పలువురికి ఉపాధి చూపుతున్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సాక్షి ప్రత్యేక కథనం.

స్వ'శక్తి'తో ముందుకు..



ఆన్‌లైన్‌లో అప్లై చేస్తున్న కల్పన

ఆదిలాబాద్: ఉన్నత విద్యాభ్యాసం చేస్తున్న మహిళ ప్రైవేట్ ఉద్యోగానికి మొగ్గు చూపింది జిల్లా కేంద్రంలోని తిర్పెల్లి కాలనీకి చెందిన ముదిగొండ కల్పన. ఇంటర్ తర్వాత వివాహం కాగా, అటు కుటుంబ బాధ్యతలు మోస్తూనే 2007లో డిగ్రీ పూర్తి చేసింది. భర్త ప్రోత్సాహంతో 2010లో జిరాక్స్, ఆన్‌లైన్ సెంటర్, బుక్‌స్టాల్ ప్రారంభించింది. టైలరింగ్ చేస్తోంది. ఇటీవల బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ తీసుకుంటుంది. ఓ వైపు ఇంటిని చక్కదిద్దుతూనే బుక్‌సెంటర్ నడుపుతోంది. కుమారుడు, కుమార్తెలను చదివించి ప్రయోజకులుగా చేయాలనే తనవంతుగా శ్రమిస్తోంది.

ఒక్క బిడ్డ చాలనుకున్నం

నిర్మల్: 'ఆడబిడ్డయితే ఏంటి.. తను వారసురాలే కదా. తనకు ఉత్తమ చదువును, ఉన్నత జీవితాన్ని ఇవ్వాలనుకున్నాం. అందుకే మాకు ఒక్కబిడ్డనే చాలనుకున్నాం..' అంటున్నారు నిర్మల్ జిల్లాకేంద్రంలోని ఆదర్శనగర్‌కు చెందిన తిరుపతి సుస్మిత, ప్రమోద్‌రావు దంపతులు. ఎవరెన్ని ఒత్తిళ్లు పెట్టినావారు అనుకున్నట్లుగానే ఒక్కబిడ్డకే జన్మనిచ్చారు. తన ఆకాంక్షలకు తగ్గట్లుగానే చదివించారు. తల్లిదండ్రుల ఆశయాలను ఆకళింపు చేసుకున్న ఆ బిడ్డ శరదితన్వి తనకంటూ గుర్తింపును తెచ్చుకుంటోంది. స్థానిక దీక్ష జూనియర్ కళాశాల కరస్పాండెంట్‌గా చేస్తున్న ప్రమోద్‌రావు ముందు నుంచి కొంత సామాజిక స్పృహతో ఆలోచిస్తుంటారు. శరదితన్వి ప్రస్తుతం ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ ఆక్సెంచర్‌లో సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా చేస్తోంది. తండ్రిలాగే సామాజికస్పృహతో తన స్థాయిలో సేవలందిస్తోంది.



తమ బిడ్డ శరదితన్వితో సుస్మిత, ప్రమోద్‌రావు దంపతులు

ఆడబిడ్డపై ఆలోచన మారాలి

నిర్మల్: 'ఆడబిడ్డయినా.. మగబిడ్డయినా ఒకటే. ఒకప్పుడు మగపిల్లాడుంటే చాలు అనుకునేది. కానీ.. ఈరోజుల్లో ఎవరైనా మంచి చదువు, ఉద్యోగం ఉంటేనే విలువ. పెద్దపెద్ద కార్పొరేట్ కంపెనీల నుంచి మొదలు పెళ్లి సంబంధాల దాకా ఆడ, మగ అనే తేడాలు చూడటం లేదు. వారి చదువు, హోదా, సంస్కారాన్ని గుర్తిస్తున్నారు. అందుకే మాకు ఒక్క ఆడబిడ్డనే అని ఏరోజూ ఆలోచించలేదు..' అని చెబుతున్నారు నిర్మల్‌కు చెందిన వైద్య దంపతులు చిటికేశి రంజిత, సంతోష్‌రాజ్. తమ బిడ్డ ఇషితారాజ్ ఎంత చదివితే అంత చదివిస్తామంటున్నారు. ప్రస్తుతం తాను ఎంబీబీఎస్ చదువుతోంది. అమ్మ గైనకాలజిస్ట్, నాన్న పీడియాట్రిక్ వైద్యుడు.వీరిద్దరూ బిడ్డకు గైడ్ చేస్తున్నామే తప్పా.. ఇది చదువు, అది చేయు అని చెప్పడం లేదంటున్నారు. అన్నిరంగాల్లో స్త్రీ, పురుషులు సమానంగా పనిచేస్తున్నారని, ఇకపై ఆడ,మగ అనే ఆలోచనను మానుకోవాల్సిందేనని అంటున్నారు.



తమ బిడ్డ ఇషితారాజ్‌తో వైద్యదంపతులు రంజిత, సంతోష్‌రాజ్

చిన్నచూపు పోవాలి



ఆసిఫాబాద్‌అర్బన్: మా స్వగ్రామం మంచిర్యాల. నాన్న ఓ సంస్థలో చిరుద్యోగి. ఇద్దరం ఆడపిల్లలం అయినా ఎవరిపైనా ఆధారపడొద్దని ఉన్నత చదువులు చదివించారు. నేను ప్రస్తుతం ఆసిఫాబాద్ అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్(ఏటీవో)గా పనిచేస్తుండగా, మా చెల్లెలు ప్రభుత్వ టీచర్‌గా విధులు నిర్వర్తిస్తోంది. నాకు ముగ్గురు, మా చెల్లికి ఇద్దరు ఆడపిల్లలే. వారిని అన్నిరంగాల్లో రాణించేలా తీర్చిదిద్దుతాం. చదువుతోనే భవిష్యత్తు బాగుంటుంది. ప్రతీ మహిళా చట్టాలపై అవగాహన ఉండాలి. సమాజంలో మహిళలనే చిన్నచూపు పోవాలి.– **భానుమతి గోమాస, అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్**

ఇతరులపై ఆధారపడకుండా..



ఆసిఫాబాద్‌అర్బన్: ఇతరులపై ఆధారపడకుండా సొంతకాళ్లపై నిలబడాలని నిర్ణయించుకున్నా. ఇంటి వద్దే 20 ఏళ్ల క్రితమే టిఫిన్స్ సెంటర్ ప్రారంభించా. ప్రస్తుతం ఇంటి వద్ద 15 మంది ఉపాధి కల్పిస్తూ.. వ్యాపారం విజయవంతంగా కొనసాగుతోంది. ఇటీవల ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరా క్యాంటీన్‌ను జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ప్రారంభించాం. అక్కడ కూడా మరో ఐదుగురు ఉపాధి పొందుతున్నారు. మహిళలు ఎందులోనూ తక్కువ కాదు. ఆర్థిక స్వాతంత్ర్యం సాధించాలి. – **మార స్వరూప, మహిళా సమాఖ్య సంఘం సభ్యురాలు, ఆసిఫాబాద్**

వైద్య వృత్తిని వదిలి.. ప్రజాసేవకు కదిలి



బోథ్: ఎంబీబీఎస్ పూర్తి చేసి.. వైద్య వృత్తిని వదిలి ప్రజాసేవకు కదిలారు బోథ్‌కు చెందిన డాక్టర్ సంధ్యారాణి. జెడ్పీటీసీగా గెలుపొంది మహిళా శక్తిని నిరూపించారు. బోథ్ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించారు. జెడ్పీ సమావేశాల్లో తనగొంతు వినిపించారు. ఆమె వైద్యురాలు కావడంతో బోథ్ ఆసుపత్రిని అభివృద్ధి పర్చే ప్రయత్నం చేశారు. ఆసుపత్రి భవన నిర్మాణానికి మంత్రులు, ఉన్నతాధికారులను కలిసి రూ.10 కోట్ల నిధులు తేవడంలో కృషిచేశారు. మాజీ జెడ్పీటీసీగా ఆమె పలు కార్యక్రమాల్లో పాల్గొంటోంది. – **డా.సంధ్యారాణి, మాజీ జెడ్పీటీసీ, బోథ్**

తేడా ఉండొద్దు



ఆసిఫాబాద్‌రూరల్: మహిళలు, పురుషులు అనే తేడా లేకుండా సమాజంలో అందరం ఒక్కటే అనే భావన రావాలి. కొంత మంది తల్లిదండ్రులు కుమార్తె కంటే కుమారుడినే ఎక్కువ ఇష్టపడుతారు. అలా సంతానాన్ని సమానంగా చూడాలి. వారి నిర్ణయాలకు విలువ ఇవ్వాలి. – **శ్రీదేవి, బీజెడ్‌సీ సెకండియర్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ఆసిఫాబాద్**

కఠిన చట్టాలు రావాలి



ఆసిఫాబాద్‌రూరల్: మహిళలకు కొన్నిచోట్ల రక్షణ లేకుండా పోయింది. యువతులు, మహిళలపై లైంగిక దాడులు పెరిగిపోయాయి. తప్పుచేసిన వారికి కఠిన శిక్షలు లేకపోవడంతో రెచ్చిపోతున్నారు. సమాజంలో మహిళల రక్షణకు కఠిన చట్టాలు రావాలి. – **అశ్విని, ఎంపీసీఎస్ ఫైనలియర్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ఆసిఫాబాద్**

భర్త ప్రోత్సాహంతో



భీమారం: ప్రభుత్వ ఉద్యోగిగా స్థిరపడాలనే లక్ష్యం పాఠశాల స్థాయిలో ఏర్పడింది. అందుకు బాగా చదివాను. పెళ్లయ్యాక చదువుకోవాలని భర్త ప్రోత్సాహించారు. టీచర్‌గా సేవ చేయాలనే కోరిక ఉన్నా భర్త తనను ఎస్సైగా చూడాలని ఉండేది. హైదరాబాద్‌కు వెళ్లి కోచింగ్ తీసుకున్నా. 2019 ఎస్సైగా ఎంపికయ్యాను. – **కె శ్వేత,భీమారం ఎస్సై**

అప్పుడు సర్పంచ్.. ఇప్పుడు టీచర్



పాఠం బోధిస్తున్న చెవ్వ సువర్ణ

చెన్నూర్‌రూరల్: గతంలో సర్పంచ్‌గా పని చేసింది. ఆ పదవీ కాలం పూర్తి కాగానే ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకుంది. మండలంలోని అంగ్రాజ్‌పల్లికి చెందిన చెవ్వ సువర్ణ. తాండూరు మండలం తంగళ్లపల్లికి చెందిన ఈమెకు చెన్నూర్ మండలం అంగ్రాజ్‌పల్లికి చెందిన చెవ్వ శ్రీనివాస్‌తో 2003లో వివాహమైంది. వీరికి ఇద్దరు ఆడ పిల్లలు. అప్పటికే బీఎస్సీ ఫస్టియర్ చదివింది. మూడేళ్లలో పూర్తి చేయాల్సిన డిగ్రీ.. పిల్లల ఆలపాలన చూసుకుంటూ ఐదేళ్లు పట్టింది. 2010లో ఎంఎస్సీ, 2012లో బీఈడీ పూర్తి చేసింది. 2013లో సర్పంచ్‌కు బీసీ మహిళా రిజర్వేషన్ రావడంతో గ్రామస్తుల కోరిక మేరకు స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందింది. ఐదేళ్లవరకు ప్రజలకు సేవలందించింది. 2019లో చెన్నూర్‌లోని సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో గణిత టీచర్‌గా ఎంపికై విద్యార్థులకు పాఠాలు చెబుతోంది. భర్త ప్రోత్సాహంతో సాధ్యమైందని అంటోంది.

స్విట్జర్లాండ్‌లో సాఫ్ట్‌వేర్ జాబ్



కోటపల్లి: మా స్వగ్రామం కోటపల్లి. మేము నలుగురు అక్కాచెల్లెళ్లు. తల్లిదండ్రులు బాగా చదివించారు. అందరూ వివిధ రంగాల్లో స్థిరపడ్డాం. తాను స్విట్జర్లాండ్‌లో ఆరేళ్లుగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నా. ఏటా రెండు నెలలు అమ్మానాన్నలను స్విట్జర్లాండ్‌కు తీసుకెళ్తున్నా. – **లక్ష్మీప్రసన్న**

తల్లిదండ్రుల ప్రోత్సాహం వల్లనే..



ఖానాపూర్: మా తల్లిదండ్రులు రవి–లావణ్య. మేము చిన్న వయస్సులో ఉన్నప్పటి నుంచి వడ్రంగి వృత్తి చేస్తూ కష్టపడి చదివించారు. మేం ఇద్దరు కూతుళ్ల తల్లిదండ్రుల ప్రోత్సాహం వల్ల ఉద్యోగాలు సాధించారు. ఒకరు ఎస్జీటీ టీచర్‌గా పెంబి మండలం నాగాపూర్‌లో, మరొకరు నిర్మల్ మున్సిపాల్టీలో వార్డు ఆఫీసర్‌గా పనిచేస్తోంది. – **రక్షిత–మాధురి**

కుక్కల దాడిలో పలువురికి గాయాలు



చికిత్స చేయించుకున్న సరోజ

ఖానాపూర్: కుక్కల దాడిలో పలువురికి గాయాలయ్యాయి. పట్టణంలోని గాంధీనగర్ కాలనీకి చెందిన కుమ్మరి మల్లవ్వను శుక్రవారం వీధి కుక్కలు వెంబడించి దాడి చేశాయి. వృద్ధురాలి కాలి పై భాగంతోపాటు ఇతర చోట్ల తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆమె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. సేవ్యానాయక్‌తండాలో కొర్ర సరోజ, బుక్య పవన్ (5)తోపాటు మరో మేకపై కుక్క దాడిచేసి తీవ్రంగా గాయపర్చింది. తీవ్రంగా గాయాలైన సరోజను మెరుగైన వైద్యం కోసం వైద్యులు నిర్మల్ ఏరియాస్పత్రికి రిఫర్ చేశారు.

బొలెరో వాహనం బోల్తా



బోల్తాపడిన వాహనం

సారంగపూర్: మండలంలోని మహబూబాఘాట్స్ సమీపంలో శుక్రవారం బొలెరో పికప్ వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. ఆదిలాబాద్ నుంచి నిర్మల్ వైపు ఇంజిన్ ఆయిల్ బాటిళ్ల లోడ్‌తో వస్తోంది. డ్రైవర్ అతి వేగంగా, అజాగ్రత్తగా నడపడంతో ప్రమాదం చోటుచేసుకుంది. డ్రైవర్‌తోపాటు ఆయన పక్కనే ఉన్న నిఖిల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నటన్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

హెచ్‌ఎం ఆలస్యంగా వస్తున్నారని..

- ఆయన వాహనాన్ని అడ్డుకున్న విద్యార్థులు
- ధన్నూర్(బి) జెడ్పీ సెకండరీ పాఠశాలలో ఘటన

బోథ్: పాఠశాలకు హెచ్‌ఎం తరచూ ఆలస్యంగా వస్తున్నారని, హాల్‌టికెట్లు ఇవ్వమని భయపెడుతున్నారని విద్యార్థులు ఆయన వాహనాన్ని అడ్డుకున్నారు. మండలంలోని ధన్నూర్(బి) జెడ్పీ సెకండరీ పాఠశాలలో ఈ ఘటన చోటుచేసుకుంది. హెచ్‌ఎం రాజు చోప్డే వాహనాన్ని పాఠశాల గేటు వద్ద శుక్రవారం ఉదయం అడ్డుకున్నారు. పదో తరగతి గది బయట విద్యార్థులు భైఠాయించారు. హెచ్‌ఎం ప్రతీరోజు పాఠశాలకు ఆలస్యంగా రావడం సరికాదన్నారు. తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలన్నారు. కాగా గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మద్యం తాగి తరచూ పాఠశాలకు వస్తున్నారని ఆరోపించారు. ఇటీవల ఆ వ్యక్తి పాఠశాలకు మద్యం తాగి వచ్చి హంగామా చేయడంతో విద్యార్థులు భయభ్రాంతులకు గురయ్యారని పలువురు గ్రామస్తులు పేర్కొన్నారు. పదో తరగతి విద్యార్థులకు ప్రీ ఫైనల్ పరీక్షలు ఉండటంతో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు వారితో మాట్లాడారు. ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు. విషయం తెలుసుకున్న ఎంఈవో మహమూద్, ఎంపీడీవో రమేశ్ అక్కడికి చేరుకుని వారితో మాట్లాడారు. జరిగిన ఘటనపై ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. దీంతో విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు.



తరగతి గది ఎదుట భైఠాయించిన విద్యార్థినులు



వాహనాన్ని అడ్డుకుంటున్న విద్యార్థినులు

పోగొట్టుకున్న బంగారు ఆభరణాలు అప్పగింత

ఇచ్చోడ: మండల కేంద్రంలోని ఎస్బీఐ సిరిచెల్మ ఎక్స్‌రోడ్డు బ్రాంచిలో బంగారు ఆభరణాలు పోగొట్టుకున్న వ్యక్తికి మేనేజర్ సునీల్ మనోహర్ శుక్రవారం అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. బోథ్ మండలం సొనాల గ్రామానికి చెందిన అనిల్ మండల కేంద్రంలో ముత్తూట్ ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టిన తులం బంగారాన్ని డబ్బులు కట్టి విడిపించుకున్నాడు. అక్కడి నుంచి మరో పనిమీద సిరిచెల్మ ఎక్స్‌రోడ్డులో ఎస్బీఐ బ్రాంచికి వెళ్లాడు. చెక్కు రాస్తుండగా కవరులో ఉన్న బంగారం నగలు కౌంటర్ వద్ద మరిచి బయటకు వెళ్లిపోయాడు. కౌంటర్ వద్ద కేశవపట్నం గ్రామానికి చెందిన కలీం గమనించి బ్రాంచి మేనేజర్‌కు అందించాడు. బంగారు నగలు పోగొట్టుకున్న సదరు వ్యక్తి మేనేజర్‌ను సంప్రదించాడు. బంగారం నగలను అప్పగించారు. బంగారు నగలను అందించిన కలీంను బాధితుడితోపాటు మేనేజర్, సిబ్బంది అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు



గాయపడిన మారుతి

దిలావర్‌పూర్: దిలావర్‌పూర్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. సర్సాపూర్(జి) మండలం రాంపూర్‌కు చెందిన ఒడ్డే మారుతి నిర్మల్‌కు వెళ్లి శుక్రవారం సాయంత్రం తన ఆటోలో స్వగ్రామానికి బయల్దేరాడు. నిర్మల్–భైంసా రహదారిపై టోల్‌గేట్ దాటి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న టాటా గూడ్స్ వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్ర గాయాలైన మారుతిని ఎన్‌హెచ్‌ఏఐ అంబులెన్స్‌లో నిర్మల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబీకులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు.